క్లుప్తంగా

డిప్యూటీ సీఎంకు వినతి



సమస్యలు వివరిస్తున్న మందా నాగరాజు

బూర్గంపాడు: మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ నాయకులు మందా నాగరాజు ఆదివారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎంను కలిసి మండల సమస్యలను వివరించారు. గోదావరి వరదముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

వెంటనే రిలీవ్ చేయాలి

దమ్మపేట: బదిలీ అయిన ప్రభుత్వ ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రమేశ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన యూటీఎఫ్ యూనియన్ సమావేశంలో రమేశ్‌కుమార్ మాట్లాడారు. బదిలీ అయిన ఉపాధ్యాయుల స్థానంలో తాత్కాలికంగా వలంటీర్లను నియమించాలని కోరారు. రాబోయే బడ్జెట్‌లో విద్యాశాఖకు ఎక్కువ నిధులు కేటాయించి, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ప్రసాద్, రామారావు, కనకదుర్గ, సురేశ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టిన స్వప్న



చండ్రుగొండ: చండ్రుగొండ ఎస్‌ఐగా గంజి స్వప్న ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆమె ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్‌ఐగా పనిచేసిన మాచినేని రవి, వీఆర్ కొత్తగూడెనకు వెళ్లారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

చండ్రుగొండ: ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ నేపథ్యంలో అనేక త్యాగాలు చేసి పోరాటాలు చేసిన వారికి కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఉద్యమ నాయకుల జేఏసీ మండల శాఖ డిమాండ్ చేసింది. నాయకులు గాదె లింగయ్య, రామిశెట్టి సైదయ్య, ఎస్కే జాఫర్ ఆదివారం విలేకరులతో మాట్లాడారు. నిజమైన ఉద్యమకారులను గుర్తించి పెన్షన్లు, ప్రభుత్వ పథకాల్లో తొలి ప్రాధాన్యత, పిల్లలకు విద్య, వైద్యం ఉచితంగా అందించాలని కోరారు. సమావేశంలో ఉద్యమకారులు యండీ నాబీద్ హుసేన్, యండీ అన్వర్, బూర్గు రమేశ్, ఆకుల శ్రీనివాసరావు, జిల్లెళ్ల రాము, సుంకర రామారావు తదితరులు పాల్గొన్నారు.

రేపు సామాజిక తనిఖీ

కరకగూడెం: మండలంలోని 16 గ్రామ పంచాయతీల పరిధిలో 2023, ఏప్రిల్ 1 నుంచి 2024, మార్చి 31 వరకు ఉపాధి హామీ పథకం, అటవీ శాఖలో చేపట్టిన పనులపై మంగళవారం భట్టుపల్లి రైతువేదికలో ఉదయం 10 గంటలకు 3వ విడత సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు కరకగూడెం మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓ దేవా వరకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రజా ప్రతినిధులు, స్పెషల్ ఆఫీసర్లు, ఉపాధి హామీ పథకానికి సంబంధించిన అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని పేర్కొన్నారు.

ఉద్యోగాల నుంచి శాశ్వతంగా తొలగించాలి

భద్రాచలంటౌన్: అశ్వారావుపేట ఎస్‌ఐ శ్రీనివాస్ ఆత్మహత్య కేసులో ప్రమేయం ఉన్న పోలీసులను ఉద్యోగాల నుంచి పూర్తిగా తొలగించాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షులు అల్లాడి పాల్‌రాజ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎంపీకాలనీలో ఆదివారం జరిగిన మాల మహానాడు ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దళిత ఉద్యోగులపై ప్రతిరోజూ ఏదో ఒకచోట వివక్ష, అంటరానితనంతో కూడిన అవమానాలు జరుగుతూనే ఉన్నాయని తెలిపారు. ఎస్‌ఐ శ్రీనివాస్ ఆత్మహత్యకు కారకులైన సీఐతోపాటు నలుగురు కానిస్టేబుళ్లను పూర్తిగా విధుల నుంచి తొలగించాలని పేర్కొన్నారు. సమావేశంలో అల్లాడి దుర్గారావు, బర్ల రామకృష్ణ, మోరంపల్లి రాంబాబు, వీరబాబు, సందీప్ పాల్గొన్నారు.

అక్రమ బదిలీలు నిలిపివేయాలి

మణుగూరుటౌన్: కొండాపురం గనిలో సర్ఫేస్ మజ్దూర్లుగా పనిచేస్తున్న కొంతమంది కార్మికులను యాజమాన్యం ఇష్టానురీతిగా బదిలీ చేస్తూ వారి కుటుంబాలను మనోవేదనకు గురిచేయడం సరికాదని టీబీజీకేఎస్ మణుగూరు వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకట్ అన్నారు. దరఖాస్తులు కోరిన అనంతరం సీనియార్టీ ప్రకారం బదిలీ చేయాలని స్టాండింగ్ నిబంధనలు చెబుతున్నప్పటికీ కక్షకట్టి మరీ కొంత మంది కార్మికులను ఎంపిక చేసి వారినే పంపడం సరికాదని పేర్కొన్నారు. కార్మిక శ్రేయస్సు, సంస్థ ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకుని అక్రమ బదిలీలు నిలిపివేయాలని, కక్ష సాధింపు చర్యలు విడనాడాలని కోరారు.

ట్రెండీగా రెయిన్ సూట్స్!

- అన్ని వర్గాల వారిని ఆకట్టుకునేలా మోడళ్లు
- బ్రాండెడ్‌తో పాటు స్థానిక కంపెనీలవీ అందుబాటులో..
- వర్షాకాలంలో నానాటికీ పెరుగుతున్న డిమాండ్



విక్రయానికి సిద్ధంగా ఉన్న రెయిన్‌కోట్లు

భద్రాచలంఅర్బన్: వర్షాకాలం ప్రారంభమైంది. పనినిమిత్తం ఇల్లు వదిలి బయటకు వెళ్తే ఏ క్షణంలో వర్షం వస్తుందో.. తడుస్తామో తెలియదు. ఈ క్రమంలో వర్షాకాలంలో బయటకు వెళ్లాలంటే తడుస్తామనే బాధ అందరికీ ఉంటుంది. దీంతో రెయిన్ సూట్లకు డిమాండ్ పెరుగుతోంది. స్కూళ్లకు వెళ్లే చిన్నారులు, కార్యాలయాలకు వెళ్లే వారు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు వర్షమైనా తప్పనిసరి బయటకు వెళ్లాల్సిందే. ఇందులో చాలామందికి గొడుగులు వినియోగించడం కష్టమే. వాహనచోదకులకైతే మరీ కష్టం. అందుకే ఈజీగా ఉండే రెయిన్ సూట్లను కోరుకుంటున్నారు. ఇవి వర్షంలో తడవకుండా రక్షణనిస్తాయి. పైగా వేసుకున్నవారికి వెచ్చగా చూసేవారికి మెచ్చేలా ఉంటాయి. ఇలా అన్నివర్గాల వారిని ఆకట్టుకునేలా మాన్‌సూన్ సూట్లకు క్రేజ్ పెరిగింది.

క్రేజీగా.. స్టైలిష్‌గా..

చూడటానికి క్రేజీగా.. ధరిస్తే స్టైలిష్ గా కనిపించే రెయిన్ సూట్లు మార్కెట్లో విభిన్న మోడళ్లలో ఉన్నాయి. రంగురంగుల డిజైన్లతో ఆకట్టుకుంటున్నాయి. సిరిసిల్లలోని షోరూంలు, రోడ్ల వెంట వివిధ రకాల రెయిన్ సూట్లు విక్రయిస్తున్నారు. రీబాక్, లీ, ఫ్లయింగ్ మిషన్, కాప్‌స్టన్, వుడ్‌ల్యాండ్, నైక్, ఆడ్‌లైఫ్, జరా వంటి బ్రాండెడ్ కంపెనీలతో సహా అన్ బ్రాండెడ్‌లోనూ ఎన్నో రకాలున్నాయి. భద్రాచలం పట్టణంలో యూబీ రోడ్డు, బస్టాండ్ సెంటర్, చర్ల రోడ్డు, బ్యాంక్ రోడ్డు వంటి ఇతర ప్రాంతాల్లో షాపుల్లో సూట్లను విక్రయిస్తున్నారు.

రూ.వెయ్యి నుంచి మొదలు..

వర్షాకాలంలో ప్రజల్లో రెయిన్ సూట్లకు ఉన్న క్రేజ్‌లో అనుకూలమైన రేట్లలో విక్రయాలు సాగుతున్నాయి. రెయిన్ ప్యాంట్, షర్ట్, జాకెట్, లాంగ్ జాకెట్, టూ ఇన్ వన్ జాకెట్, లెదర్ జాకెట్, రెగ్జిన్ బ్యాక్ గ్రౌండ్‌తో సూట్లు తయారవుతున్నాయి. వీటిని వ్యాపారులు హైదరాబాద్, ముంబై, ఢిల్లీ, బెంగళూరు నుంచి తెప్పిస్తున్నారు. బ్రాండెడ్ ధర రూ.వెయ్యి నుంచి మొదలుకుని ఉన్నాయి. ఇక స్థానిక కంపెనీలవైతే రూ.250 నుంచి రూ.వెయ్యి లోపు ధర పలుకుతున్నాయి.

యువత ఇష్టపడుతోంది..



స్టైలిష్‌గా ఉండే బ్రాండెడ్ మాన్‌సూన్ సూట్లు యూత్ ఇష్టపడుతున్నారు. కస్టమర్లు మెచ్చే మోడళ్లలో సూట్లు తెప్పించాం. నేటి ట్రెండ్‌కు తగ్గట్లుగా అన్ని బ్రాండ్లవి అందుబాటులో ఉన్నాయి. హైదరాబాద్ వంటి నగరాల ధరల్లోనే స్థానికంగా అందిస్తున్నాం. ఎక్కువగా ఇండివిజువల్‌గా ఉండే కోట్లకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

–పరమేశ్వరరావు, వ్యాపారి, భద్రాచలం

వర్షాకాలంలో తప్పనిసరి



వానాకాలంలో వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లే వారందరూ రెయిన్ కోట్ వేసుకోవాల్సిందే. వాహనాలపై వెళ్లడానికి గొడుగు కంటే మాన్‌సూన్ సూట్లే సౌకర్యవంతంగా ఉంటాయి. బ్రాండెడ్ సూట్లు చూడటానికి అందంగా.. పదికాలాలు మన్నికగా ఉంటాయి. భద్రాచలంలో ఎన్నో రకాల మోడళ్లలో మాన్ సూట్లు లభిస్తున్నాయి.

–ప్రసాద్, భద్రాచలం

సౌకర్యంగా ఉంది



వర్షంలో బయటకు వెళితే రెయిన్ కోట్‌తో శరీరానికి రక్షణ ఉంటుంది. స్టైలిష్‌గా ఉండి వర్షం, చలి నుంచి కాపాడటం వీటి ప్రత్యేకత. గాలి, వర్షం ధాటికి శరీరానికి రక్షణనిచ్చి వెచ్చగా ఉంచుతాయి. రెయిన్ కోట్ ధరించడంతో వర్షంలో ఎంతో సౌకర్యంగా ఉంది. ఆన్‌లైన్‌లోనూ రకరకాల మాన్‌సూన్ సూట్లు లభిస్తున్నాయి.

–ఎలమల అశోక్‌కుమార్, భద్రాచలం

జిల్లా రైతులకు నీరు అందించండి

సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య



మాట్లాడుతున్న అన్నవరం కనకయ్య

ములకలపల్లి: సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ (ఎస్ఆర్ఎల్ఐపీ) సాగునీరు జిల్లా రైతాంగానికి అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య డిమాండ్ చేశారు. ములకలపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మండల కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రాజెక్ట్ నిర్మాణంలో భద్రాద్రి జిల్లాలోని సాగుభూములను వాడుకొని, నిర్మాణం పూర్తయిన తరువాత జిల్లాకు మొండిచేయి చూపడం శోచనీయమన్నారు. జిల్లాలో ప్రవహిస్తున్న గోదావరి నీటిని ఎస్ఆర్ఎల్ఐపీ కాలువల గుండా ఇతర జిల్లాలకు తరలించడం దారుణమని, జిల్లాలో బీడుభూములకు ఎస్ఆర్ఎల్ఐపీ ద్వారా సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, ఊకంటి రవికుమార్, మాలోత్ రావూజా, గొగ్గెల ఆదినారాయణ, నిమ్మల మధు, సోయం వీరస్వామి, డిష్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లికి అందించాలి

సీతారామ ప్రాజెక్ట్ నీరు ములకలపల్లి మండలానికి అందించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఎస్కే ఉమర్, ములకలపల్లి సబ్‌డివిజన్ కార్యదర్శి కుంజా కృష్ణ డిమాండ్ చేశారు. నీళ్లు ఇవ్వాలని కోరుతూ మండలంలోని గుట్టగూడెం గ్రామంలో ఆదివారం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలోని వీకే రామవరం, కమలాపురం గ్రామాల్లో రెండు పంప్‌హౌస్‌లు నిర్మించినా, మండల రైతాంగానికి సాగునీరు ఇవ్వకపోవడం సరికాదని, స్థానిక ఆదివాసీల భూమలకు నీళ్లు ఇవ్వకుండా, ఖమ్మం జిల్లాలోని మైదాన ప్రాంతాలకు తరలించుకుపోయే కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. డివిజన్ నాయకులు ఆదినారాయణ, చింతల వెంకటేశ్వర్లు, సురేశ్, దుబ్బా వెంకటేశ్వర్లు, కొర్రి వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

మా నీళ్లు మాకే కావాలి

దుమ్ముగూడెం: సీతారామ ప్రాజెక్టు నీళ్లు భద్రాద్రి జిల్లాకు చెందినవని, వాటిని పక్క జిల్లాలకు మళ్లించడం సరికాదని, మా నీళ్లు మాకే కావాలి అంటూ సీపీఐ (ఎంఎల్)న్యూడెమోక్రసీ సబ్‌డివిజన్ కార్యదర్శి ముసలి సతీశ్ డిమాండ్ చేశారు. ఆదివారం పార్టీ జిల్లా కమిటీ పిలుపులో భాగంగా లక్ష్మీనగరం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు ఒక్క ఎకరాకు నీరు ఇవ్వకుండా పక్క జిల్లాకు నీళ్లు మళ్లించడం సరికాదని, ప్రాజెక్ట్ డిజైన్ మార్చి ఈ జిల్లాకు అన్యాయం చేశారని మండిపడ్డారు. తక్షణమే గోదావరి నీళ్లను భద్రాద్రి కొత్తగూడెం జిల్లాతో పాటు ఏజెన్సీ ప్రాంతాలకు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బుద్దులు సమ్మక్క, మడకం సమ్మక్క, మడకం సీతక్క, శీలం లక్ష్మి దేవి, అజయ్, రాజు, రమేశ్, కనక పాల్గొన్నారు.

ఏజెన్సీ ప్రాంతాలకు ఇవ్వాలి

గుండాల: సీతారామ ప్రాజెక్టు ద్వారా అందిస్తున్న నీళ్లను ఏజెన్సీ ప్రాంతాలకు ఇవ్వాలని ఆదివాసీ ట్రైబల్ ఫోరం జాతీయ కన్వీనర్ ముక్తి సత్యం ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పినపాక నియోజకవర్గం నుంచి గోదావరి జలాలను సీతారామ ప్రాజెక్టు పేరుతో మైదాన ప్రాంతానికి తరలించడం సమంజసం కాదని, తొలత ఏజెన్సీ జిల్లా అయిన భద్రాద్రి కొత్తగూడెంనకు సాగునీరు అందించాలని, టేకులపల్లి మండలం రోళ్లపాడు చెరువుదగ్గర రిజర్వాయర్ ఏర్పాటు చేసి ఎత్తిపోతల పథకం ద్వారా గుండాల మండలానికి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.

పనులు పారదర్శకంగా చేపట్టండి..



మాట్లాడుతున్న ఎంపీటీసీ సభ్యుడు కోటేశ్వరరావు

మణుగూరురూరల్: ఉపాధి హామీ పనులను పారదర్శకంగా చేపట్టాలని ఎంపీటీసీల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, కూనవరం ఎంపీటీసీ సభ్యుడు గుడిపూడి కోటేశ్వరరావు అధికారులను కోరారు. ఆదివారం కూనవరం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభలో ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 వరకు జరిగిన ఉపాధి హామీ పనుల వివరాలపై చర్చించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ.. ఉపాధి హామీ పనులను జాగ్రత్తగా ఆలోచించి గుర్తించాలని, నిధులు దుర్వినియోగం కాకుండా చూడాలని, మస్టర్ల విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని తెలిపారు. గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి, ఎంఈఓ వీరస్వామి, ఇరిగేషన్ ఏఈ సక్రు, పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి, డీఆర్‌పీ రాజు, ఉపాధి హామీ ఫీల్డ్ ఆఫీసర్ మంగయ్య, మేట్లు, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

కొత్వాల శ్రీనివాసరావుకు అభినందనలు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న దమ్మపేట నాయకులు

దమ్మపేట: ఉమ్మడి ఖమ్మం జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావుకు మండల నాయకులు అభినందనలు తెలిపారు. ఆదివారం కొత్తగూడెంలో కొత్వాలను ఆయన నివాసంలో దమ్మపేట మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల తెలంగాణ రాష్ట్ర సహకార మార్కెటింగ్ సమాఖ్య లిమిటెడ్ ఎక్స్ అఫీషియో డైరెక్టర్‌గా కొత్వాల నియమితులైన సందర్భంగా ఆయన్ను సత్కరించారు. కార్యక్రమంలో చిన్నశెట్టి సత్యనారాయణ, చిన్నశెట్టి యుగంధర్, చక్కిరాల మల్లేశ్వరరావు, పానకాల సత్యనారాయణ, చిన్నశెట్టి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంబో పరిశ్రమకు సహకరించండి



ఎంపీ రఘురామిరెడ్డితో బ్యాంబో క్లస్టర్ బాధ్యులు

చండ్రుగొండ: మండలంలోని బెండాలపాడులో స్థాపించి నిర్వహిస్తున్న బ్యాంబో క్లస్టర్‌కు సహకరించాలని క్లస్టర్ బాధ్యులు ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డికి విన్నవించారు. కొత్తగూడెంలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఎంపీని కలిశారు. బ్యాంబో ఉత్పత్తులను మార్కెటింగ్ చేయాల్సిఉందని, ప్రస్తుతం వేయి మందికి ఉపాధి కల్పిస్తున్నామని, రెండు వేల మందికి ఉపాధి కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నామని ఎంపీకి వివరించారు. కార్యక్రమంలో ఈసం నాగభూషణం, బొర్రా సురేశ్, మల్లం కృష్ణయ్య, భోజ్యానాయక్, ఎండీ ఫజల్‌బక్ష్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న ఆనాటి విద్యార్థులు

మణుగూరురూరల్: మండలంలోని రామానుజవరం గ్రామపంచాయతీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2011–12 విద్యా సంవత్సరానికి చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. పూర్వ విద్యార్థులంతా పదకొండేళ్ల అనంతరం ఒకచోట చేరి ఆనాటి మధుర స్మృతులు, జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు.

మహాసభలను జయప్రదం చేయండి..

గుండాల: ఈ నెల 21న ఇల్లెందులో జరిగే తెలంగాణ ప్రగతి శీల ఆటో మోటార్ వర్కర్స్ ఫెడరేషన్ (ఐఎఫ్టీయూ) రాష్ట్ర 5వ మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి తోడేటి నాగేశ్వరరావు, గుండాల ఏరియా కమిటీ కార్యదర్శి యాసారపు వెంకన్న పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో వాల్ పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర రవాణా రంగంలో 25 లక్షల మంది కార్మికులు పనిచేస్తున్నారని, వారికి సంక్షేమ బోర్డు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. డ్రైవర్లకు ఉరితాడుగా మారిన హిట్, రన్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మోటార్ కార్మికులపై మోదీ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో డి.మోహన్‌రావు, డి.నూనేశ్వరరావు, రేసు అంజయ్య, జగన్, గడ్డం నాగేశ్, మెంతిని నాగేశ్, ఎస్‌కే యాకూబ్, సట్టు వినోద్ తదితరులు పాల్గొన్నారు.

గౌడ కులస్తులను ప్రభుత్వం ఆదుకోవాలి

అశ్వాపురం: గౌడ కులస్తులను ప్రభుత్వం ఆదుకోవాలని గౌడ సంఘం మండల అధ్యక్షుడు, బీసీ సంఘం మండల ఉపాధ్యక్షుడు అండెం గంగరాజు కోరారు. ఆదివారం మల్లెలమడుగులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2018 నుంచి 2023 వరకు బీఆర్ఎస్ గౌడలకు మొండిచేయి చూపిందని, కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి గౌడలకు జీవన ఉపాధి కోసం ప్రతి సొసైటీకి పది ఎకరాల భూమి ఇవ్వాలని, తాటి, ఈత, ఖర్జూర వనం పెంచుకోవడానికి బడ్జెట్ కేటాయించాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు పాడిశెట్టి రాములు, చలమల రాములు, కంట్లమయ్య, వీరయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో హాజరు కావాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న గిరిజన దర్బార్ కార్యక్రమానికి అన్ని శాఖల యూనిట్ అధికారులు సకాలంలో హాజరు కావాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే గిరిజన దర్బార్‌లో ఆదివాసీ గిరిజన ప్రజలు వారి సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు అందజేయాలని పేర్కొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

మణుగూరుటౌన్: సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను ఆదివారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు లబ్ధిదారులకు అందజేశారు. ప్రజాభవన్‌లో రూ.2.50 లక్షల విలువైన చెక్కులను మండలంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 9 మంది లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పిరినాకి నవీన్, శివసైదులు, అబ్దుల్లా, కూచిపూడి బాబు, పెనుగొండ సాంబశివరావు, నాగేశ్వరరావు, దొడ్డపనేని మధు, రహీం తదితరులు ఉన్నారు.

పోలీసుల తనిఖీలు

చర్ల: మండలంలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఆదివారం చర్లలో జరిగే వారపు సంతకు సరిహద్దు ఛత్తీస్‌గఢ్ నుంచి పెద్ద ఎత్తున ఆదివాసీలు తరలివస్తుండగా వారి మాటున మావోయిస్టులు మిలిటెంట్లు, మిలీషియా సభ్యులు, కొరియర్లు రావచ్చునన్న అనుమానంతో పోలీసులు ఈ తనిఖీలను చేపట్టారు. అనుమానితులుగా భావిస్తూ పలువురిని అదుపులోకి తీసుకొని, విచారించి తరువాత విడిచిపెట్టారు.

రైతుల సంక్షేమానికి కృషి

బూర్గంపాడు: రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు పున్నంచంద్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. రైతులకు సకాలంలో రైతు భరోసా అందించి ఆదుకోవాలని, రుణమాఫీ హామీని అమలు చేయాలని కోరారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

అశ్వాపురం: మండలంలోని మల్లెలమడుగు గ్రామంలో మృతుల కుటుంబాలను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదివారం పరామర్శించారు. గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బేతం బాబు అల్లుడుతోపాటు దాసరి రవికృష్ణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ ముత్తినేని సుజాత, వైస్ ఎంపీపీ బేతం రామకృష్ణతోపాటు ఎస్‌కే ఖదిర్, గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేశ్, తూము వీరరాఘవులు, ఆవుల రవి, సురకంటి వెంకటరమణారెడ్డి, రాగం మల్లయ్య, చెంచల రాము, బచ్చు వెంకటరమణ, సామకూరి వెంకన్న, బర్ల కిరణ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఘనంగా బోనాలు



దుమ్ముగూడెం: బోనాలు సమర్పిస్తున్న మహిళలు



అశ్వారావుపేటరూరల్: బోనాలతో తరలివస్తున్న మహిళలు, యువతులు

దుమ్ముగూడెం: మండలంలోని నడికుడి గ్రామంలో స్వయంభు శ్రీశ్రీమహంకాళి చాముండేశ్వరి అమ్మవారికి భక్తులు ఆషాఢ మాస బోనాలను ఆదివారం సమర్పించారు. ముందుగా ఆలయంలో అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ గ్రామాలకు చెందిన భక్తులు ఆలయానికి వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు కలుగకుండా కమిటీ బాధ్యులు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు యశ్వంత్‌శర్మ, రాఘవశర్మ, ఆలయ కమిటీ అపకశంకర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నారాయణపురంలో..

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారాయణపురం గ్రామ శివారులోని శ్రీ కట్టమైసమ్మ తల్లి ఆలయం వద్ద ఆషాఢ బోనాల సందడి నెలకొంది. గ్రామానికి చెందిన మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో బోనాలతో ముందుగా గ్రామోత్సవాన్ని నిర్వహించారు. తర్వాత గ్రామ శివారులోని కట్టమైసమ్మ తల్లి ఆలయానికి మహిళలు, యువతులంతా కలిసి బోనాలను తలపై పెట్టుకొని కాలినడకన మేళ, తాళాలతో ఆలయానికి తరలివచ్చారు. అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు



హోమం నిర్వహిస్తున్న భక్తులు

మణుగూరురూరల్: మండలంలోని రామానుజవరం గ్రామ పంచాయతీ కొండాయిగూడెం గ్రామంలో వేంచేసియున్న శ్రీభ్రమరాంబ సమేత వైద్యనాథలింగేశ్వరస్వామి ఆలయంలో ఆషాఢమాసం సందర్భంగా వారాహి అమ్మవారి నవరాత్రోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ నెల 6వ తేదీ నుంచి జరుగుతున్న అమ్మవారి మహోత్సవాలను పురస్కరించుకుని ఒక్కో వారాహి రూపిణిగా భావించి పూజలు చేస్తున్నారు. తొమ్మిదో రోజు ఆదివారం అమ్మవారు కిరిత వారాహిగా భక్తులకు దర్శనమివ్వగా.. అమ్మవారికి దేవాలయ ప్రధాన అర్చకులు, వైష్ణవిదేవి ఉపాసకులు డాక్టర్ కొమరగిరి పూర్ణాచార్యులు (పవన్) ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు.

రాజుపేటలో సింగరేణి వైద్యశిబిరం



మణుగూరుటౌన్: మాట్లాడుతున్న వైద్యులు



బూర్గంపాడు: వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

మణుగూరుటౌన్: సింగరేణి సేవా సమితి, సింగరేణి వైద్య ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో మణుగూరు మున్సిపాలిటీలోని రాజుపేటలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ వైద్యులు శేషగిరిరావు, సురేశ్, రమణయ్య సుమారు 225 మందికి పరీక్షలు చేశారు. సింగు శ్రీనివాస్, రవి, నందిని, మారేశ్వరరావు, యూసుఫ్ పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్యశిబిరం

బూర్గంపాడు: మోరంపల్లిబంజరలో పొంగులేటి స్వరాజ్యం, రాఘవరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భద్రాచలం కిమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరం విజయవంతమైంది.